# "వెలి"

అంబటాల్లయింది "సాకల్దారు తిరిగిపోయింది" కైకిలోల్లను తీసుకొని పటేలవ్వలు సేండ్లల్లకు పోతన్రు. మక్క పెరండ్లల్ల కలుపుమొక్కలు దున్నుటానికి కాపుదనపోళ్ళు నాగండ్లకు కాండ్లను తిర్రమర్రగట్టి ఎడ్లతోని నడిపించుకపోతన్రు - పనుల పోరగాండ్లు గొడ్లను మేపుటానికి సెలుకల్లకు తోలుకపోతండ్రు. అచ్చేపోయే సందడితో బజారంత గడబిడగా ఉంది.

సుక్కల్ల సెంద్రునోలె చిన్నచిన్న పెంకుటిండ్లనడుమ ఆ ఊరి దొర, సర్పంచు ఐన భూంరావ్‌గారి మేడ - ఆ మేడచుట్టూ విశాలమైన స్థలం. దాంచుట్టూ పెద్ద పరారీగోడ - ఆ గోడవతల బజారు - ఆ బజార్లో మూలకో గద్దె - ఆ గద్దె మీన పరిచిన చాపలో ఆ సమయంల దొర కూసున్నాడు - అతనికి ఓ పక్కన పోలీసుపటేలు, ఓ పక్క పట్వారి కూసున్నరు - గద్దెమీదనే చాపబయట కొందరు ఊరిపెద్దలు కూసున్నరు - గద్దెకిందనే గద్దెను పట్టుకోని తెనుగోల్ల కులపెద్ద దొంగ సూపులు సూత్తూ కూసున్నాడు - గద్దె సుట్టుపక్కల పంచాయితీ వినడానికొచ్చిన జనంతో నిండుంది. గాగద్దెనానుకొనున్న వేపచెట్టును పట్టుకొని నర్సయ్య విచారంగా నిల్చున్నడు - అతని ముఖంల ఆందోళనుంది - భయముంది - ఏమైతదోనన్న ఆతురతుంది. దైన్యం తాండవిస్తుంది. అసహనంగా అటూ ఇటూ కదులుకుంట మాటిమాటికీ దొరదిక్కు సూసుకుంట నేలకు ముఖం వేలడేసుకుంట దొర మాట కోసం ఎదురు చూస్తున్నాడు. వేపచేట్టుకు సమీపంలున్న కరెంటు స్తంభం దగ్గెర నర్సయ్య బిడ్డ మల్లవ్వ నాలెకు మొకమేసుకొని భూదేవిల లీనమయినట్టుగుంది - ఆమె ముఖంల ఆవేశం, కోపం, దుఃఖం, అవమానం కలసిన భావాలు ద్యోతకమౌతున్నాయి - ఆమె ఏమీ చెయ్యలేని నిస్సహాయురాలోలె ఉంది - మల్లవ్వకొంగు పట్టుకొని ఆమె ఆరేళ్ళకొడుకు రాజేశం మట్టిపెల్ల చేతిలకు తీసుకోని అటు ఇటు తింపుకుంట కూసున్నడు - వాడు మాటిమాటికి గద్దె దిక్కు జనం దిక్కు సూసుకుంట బిక్కు బిక్కు మంటున్నడు - గద్దెకింకో పక్కన రాజయ్య నిర్లక్ష్యంగ, పొగరుగ ఐదారుగురు సోపతికాల్లతోని నిల్చున్నడు. అతని ముఖంల చురుకుతనముంది - దేనినైనా సాధించవచ్చనే ఆత్మవిశ్వాసముంది... తానేమాత్రం తప్పు చెయ్యలేదన్న భావముంది - ఏమైనా సరే ఎదుర్కోగలనన్న ధీమా వుంది -

దొర బర్కిలీ సిగిరెట్టు దమ్ములాగి సరాయించిండు - పెద్ద మనుషుల దిక్కు తేరిపార జూసిండు - సూపును నర్సయ్య దిక్కు తిప్పిండు -

"నర్సిగా! నీ మీద మీ కులపెద్ద పిర్యాద్జేసిండు – నీ బిడ్డ సేసిన పనేందిరా–? గిట్లెక్కన్నన్న ఉంటాదిరా – ?" అన్నడు....

జనం, పెద్ద మనుషులు నర్సయ్యదిక్కు జూసింగ్రు – నర్సయ్యేం మాట్లాడలే – ఇంతల్నే

"ముండబొడ్డికి మొగుడు కావల్సచ్చినాదిర – దాని కాపురం గాకపోతే...." అన్నడు పోలీసుపటేలు.

నర్సయ్యేం జవాబియ్యలే.... ఏం జెవాబు చెప్పన్నా అని ఆలోచిస్తండు.... మల్లవ్వ మొకాన్ని మరింత నాలెకేసుకొని కూసున్నది – రాజయ్య కోరమీసాలను మెలిపెట్టుకుంట నిల్చున్నడు. "అయ్యా! కలిగం మునిగిపొమ్మంటె మునిగిపోదా ఇగ–? గిట్ల ముండబొడ్లు కడుపుల్జేసుకుంటె అనలు గొట్టుమంటె ఎట్లగొడుతయి? దొర గిదీనికి పెద్ద శిచ్చే ఎయ్యాలె – లేపోతె అన్నాలమై పోతది" అన్నడు కులపెద్ద.

అయినా నర్సయ్య జెవాబు చెప్పలేదు. ఏం జెవాబు చెప్పన్నా అని గుణాయించుకుంటున్నాడు.

"ఏందిర నర్సిగా బెల్లం గొట్టిన రాయోలె మాట్లాడుతలేవు. ఇనపడుత లేదుర–? అన్నడు పట్వారి.

నర్సయ్య లేచి జెవాబు చెప్పటానికి తయారైతండు ఇంతల్నే మల్ల దొరే అన్నడు.

"ఇంత మంది చెప్పినా ఇనపడ్తలేదుర – నువ్వేం సమదనం సెప్పకుంటవో సెప్పకో–"

నర్సయ్య నెత్తిమీద రుమాలు తీసి సేతిల పట్టుకున్నాడు–దొర కెదురుగ నిల్చున్నడు.

"ఏం జెప్పాలె బాంచెను –" అన్నడు.

"ఏం జెప్పన్నని సంసారోలె మాట్లాడుతున్న వేందిర–? పోర్నిజన్నె కిడ్సిపెట్టి ఏ మెరుగనట్టు మాట్లాడ్తువేందిర–?" అన్నడో పెద్దమనిషి.

"గట్లంటెట్లరో –? నువ్వేం జెప్పకుంటె మేం జెప్పిందాని కొప్పకుంటావుర–! మల్ల మాట్లాడద్దు మరి –" అన్నాడు పట్వారి.

"గట్లెట్లయిద్ది బాంచెనుఁ కాని, గిండ్లేం తప్పుందో నాకయితె తెలుత్తలేదు –" అన్నాడు నర్సయ్య.

"సెప్పతోని కొట్టనుండె గాడిది కొడుకును. నీ బిడ్డ సక్కటి పనే చేసిందని మాట్లాడుతన్నావుర –?" అన్నడు వేరే పెద్దమనిషి. "సక్కటి పని చేసిందని నే నంటాన్ననా బాంచెను –? కాని, దాని ఈడెంత బాంచెను –? మాంటె ఇరువై రొండేండ్లు, సిన్నప్పుడే పోరడు పుట్టిండు. ఇరవయేండ్లకే ముండమోసె – అప్పట్నుంటి బతికినన్ని గాలాలు అదట్లనే ఉందన్నా బాంచెను – ? సెప్పుంగ్రి దొరా, సెప్పుంగ్రి –? " అన్నడు నర్సయ్య దీనంగ.

"గదేందిరో -? ఈరేశలింగమోలె మాట్లాడుతవ్ -? బతుకంత గట్లనే ఉండమని ఎవ్వలన్నరు -? కాని, మొగల్లేకుండ కడుపు జేయించుకునుడేందిర -?" అన్నాడు దొర.

దొర మాటలకు పెద్ద మనుషులు పండ్లికిలిచ్చింండ్రు - ఒకలిద్దరు బాధపడ్డరు. మల్లవ్వ కండ్లుపొంటె నీళ్ళు దీసుకుంటూ కూసున్నది.

"తప్పే కావచ్చు బాంచెను - అయిసులున్న పోరి - ఏదో కాల్జారింది. అదేం కులంగానోనితోని పోలేదు గద -? యాడాది నుంచి దీన్ని రాజిగాని కీత్తమని అనుకొనే వస్తిమి - గిది అందరికి తెల్సిందేనాయె. అడుగుగూడ లగ్గం జేసుకుంటననవట్టె - ఇగ పంచాయితెందుకు బాంచెను -? కావల్తె ఇక్కన్నే ఉన్నడుగద రాజిగాడు, అన్నడుగింండ్రి -" అన్నడు నర్సయ్య.

"నిజమే దొర - మల్లిని రాజిగానికి మారుమానం ఇత్తనన్నదే నాయె - నర్సిగాని కెల్లక లగ్గం జెయ్యలేదు. ఇంతల్నే పోరగాండ్లు కాల్జారింండ్రు. అల్లకాల్లకు అంటగడ్తె ఐపాయె-" అన్నడో పెద్దమనిషి.

దొరా పెద్దమనిషి దిక్కుగిమి చూసిండు. ఆ పెద్ద మనిషి తలుకాయ వంచుకొని నేలసూపులు సూడబట్టిండు.

రాజయ్యను సూత్తేనే దొరుకు, దొర తాబేదార్లకు భయం. వాని కోరమీసాలు, వాడి చూపులు, నిర్లక్ష్యం ఆ ఊళ్ళోని పెద్దోల్లకు కొరకరాని కొయ్యల్లాంటివి - మొదలే వాడు పొగరుబోతు. దానికి తోడు దొరల దోపిడి, అన్యాయాల గురించి చెప్పెటోల్ల గురించి వినుకుంట మరింత రాటుదేలుతండు. రాజిగాన్నేమన్న అంటె కోడెగాల్లిసోంటి సోపతిదార్లతోని ఎదురు తిరుగతడేమోనని దొర భయం - మునుపటి తీరుగ హుకుం చెలాయించి బెదిరిత్తె ఇనెటట్టులేరు. అందుకని మెత్తగున్నట్లే ఉండి నర్సిగాన్నే బెదిరిచ్చి వెలేసి దండుగ గుంజచ్చని దొర ఆలోసిత్తండు. అందుకోసం దొర నర్సయ్య రాజిగాన్నడుగుమన్నా రాజయ్య దిక్కు చూడనే లేదు. నర్సయ్య నుద్దేశించే అన్నడు -

"కండ్లు నెత్తికెక్కినాయిర తెనుగోడ? కులకట్టుని - నీతినియమాలని ఉండద్దుర-? ఎవలిట్టమచ్చినట్లు అళ్ళు లగ్గంగాక ముందు, ముండ బొడ్లయినంక కడుపు ల్జేసుకుంటె నాయె మెక్కడుంటదిర -? బాక్కావుర మచ్చిందా - దొంగ ---"

ఏవో బూతు మాటలు తిట్టిండు - కానాతిట్లు తోవెంటబోతున్న కైలికోడె వేసిన రంకెల కల్సిపెయినాయి-

రాజయ్యకు ఆవేశం ఉరకలు లేస్తుంది - మాటిమాటికీ ముందుకురుకుతున్న రాజయ్యను సోపతికాల్లాపుతండ్రు. స్నేహితులను దొబ్బుకొని ముందుకు పోబోయిండు. కాని ఇంతల నర్సయ్యే మాట్లాడిండు -

నర్సయ్యకు దొర తిట్లతోని కొంత కోపమచ్చింది. తెగిన బొక్కెన నూతిల్దాక - గట్టిగనే మాట్లాడ్తననుకున్నడు.

"కాద్దొర - నాకు తెలువకడుగుత -? మేమ్మేం గంగల పడిసత్తం - మేమ్మీకు పిరాజ్జెయ్యలేదుగద - ఎందుకు బాంచెను మమ్ముల కాల్చుక తింటరు-?

మా సందాన మమ్ముల బతుకనియ్యరు –? కడుపయ్యింది నా బిడ్డకు – కడుపుజేసినోనికి పెండ్లమే లేదాయె – అల్లిద్దరికి లగ్గం నిచ్చయమాయె – ఇగ గీల్లందరు, గీ పంచాయితులెందుకో నాకు సముజయితలేదు."

"నర్సిగ – బాగ దూరమే పోతన్నవేందిరో –? బలుపార –? అఁ–" అన్నాడు పట్వారి.

"ఇట్టమున్నట్టు మాట్లాడుతన్నవ్ – ఇది పంచాయితా? ఏంటిదిర గాడ్దికె–?" అన్నాడు పోలీసు పటేల్.

"నువ్ పిరాజ్జెయ్యకుంటేందిర –? నీ పెద్దకులపోడు జెప్పిండు. అడే కద మీ కులపోల్ల యవ్వారమంత చూసేది – లం–కొడుక, నీకు బాగా మత్తచ్చింది– అన్నడు దొర అవేశంగ.

ఇక రాజిగానికెంత అపుకుందామన్నా కోపమాగలే – దొర ముందు కచ్చిండు – కులపెద్ద దిక్కు చూసిండు – దొర నుద్దేశించి "అ లంజకొడుకెవ్వడు మా సంగతుల్జెప్పటానికి –? తాగినోడు గట్టె తాళ్ళ పన్నని, మేం తప్ప జేసుకుంటే మేమ్మేం సూసుకుంటం – నడుమ గానికేందట–?" అన్నడు అవేశంగా.

రాజయ్య మాటలు విన్న దొర ఖంగు తిన్నడు. యువకులంత చప్పట్లు గొట్టింద్రు, పట్వారి, పోలీసు పటేల్, కులపెద్ద, పెద్దమనుషులు కిక్కురుమన్లేదు. నక్కలోలె కూసున్నరు. ఒకలిద్దరు పెద్దమనుషులకా మాటలు సంతోషం కల్గించినయి. కాని, వాళ్ళు దొరకెదురు మాట్లాడలేరు – ఎవ్వలేం మాట్లాడలే. కొంచెమాగి దొరే "రాజిగా –! నేను నీతోని మాట్లాడుతలేను. నువ్వు సప్పుడు జేకుండు – " అని పెద్దమనుష్యుల దిక్కు తిరిగి –

"నలుగురున్నకాడ న్యాయెముంటదంటరు. మీరేం జెయ్యిమంటె అజ్జేత్త – సెప్పండ్రి –" అన్నడు.

"నర్సిగానింటికి సాకలోన్ని, మంగలోన్ని బందు జెయ్యాలె....." పో.ప.

"నర్సిగాని కులంలోనించి వెలెయ్యాలి – " పట్వారి.

"నర్సిగానికి దండుగెయ్యాలె – " ఓ పెద్దమనిషి.

వాళ్ళంత తలోతీరు చెప్పి తుది నిర్ణయాన్ని దొరకిడిసి పెట్టింద్రు. దొర కొంచెంసేపు అలోసించిండు–

"పెద్దమనుషులందరి నిర్ణయాన్నిబట్టి సెప్పుతున్న. దీనికందరు కట్టుబడిండాలె – నర్సిగా –! ఇసొంటి యిడిసిపెడితే ఊరుకి కట్టులేకుంటయిపోతది – నిన్ను కులంలకెల్ల వెలేస్తున్నాం. నీ యింటికి సాకలోడు, మంగలోడు బందు – కులపోల్లు గూడ రారు – నీ ఇంటికచ్చినోనికి ఇన్నూర్రూపాయలు దండగ –" అన్నాడు.

అ తీర్పక్కడున్న దొర చంచగాల్లు పెద్ద మనుష్యులకు, ఇంకొందరికి నచ్చింది – అదన్యాయమని అందరికి తెల్సు – ఇసొంటి తీర్పు లెన్నిట్నో వాళ్ళు చూసింద్రు. కాని ఎదిరించే ధైర్యం లేదు.

రాజయ్య కళ్ళు చింత నిప్పులయ్యాయి - వాని స్నేహితులు కూడా ఆవేశంగానే ఉన్నారు. ఏం జరుగుతదో చూద్దామనుకున్నరు. ఆవేశంతోని రాజయ్య పండ్లు కొరికిండు. ముందుకచ్చి మాట్లాడబోయిన రాజయ్యనాపి నర్సయ్య-

"నువ్వాగుర రాజిగ - నేను మాట్లాడుత - కట్టెరిసినట్టు మాట్లాడు తెల్లర -?" అని -

"దొరా! గట్లయితెట్ల బాంచెను - మీరే ఆదుకోవాలె గులాపోన్ని" అని దొర కాళ్ళూ, పట్వారి, పటేల్, కులపెద్దల కాళ్ళు పట్టుకున్నడు. పడుచు పోరగాండ్లతోని రాజయ్య అండగా ఉన్నా తరతరాల బాంచెతనం నర్సయ్యతో నా పని చేయించింది. దొర కోరుకున్నది కూడా అదే. వాన్ని కులం నుంచి వెలేస్తే తనకేమొస్తది -? ఆ పేరున బెదరించి దండగ గుంజాలెనని దొర పథకం - దొర తాబేదార్ల ప్లానుగూడదే. ఎనుకటి కాలమయితె రాజయ్య పొగరుబోతు మాటలకు పెద్ద శిక్షే వేసెటోడు దొర. కాని కాలమెట్లనో ఉన్నది. కాలంతోని మారినట్టే మారి పైసలు గుంజచ్చని దొర ప్లాను. వచ్చిన అవకాశాన్ని ఇడవకూడదనుకున్నడు -

"సరేపోరా - నువ్వింత బతిమిలాడ్తన్నవని ఇడిసిపెడ్తున్నం. కుల తప్పు కింద కులపోల్లకు, పంచాయతి బోర్డుకు చెరో ఐదునూర్లు మొత్తం వెయ్యి రూపాయలు గట్టి కులంలకు రా - అటెనుక మల్లిని రాజిగానికిచ్చి మారుమనం చెయ్యి -" అన్నడు. దొర తాబేదార్లా మాటలు విని సంబరపడ్డారు.

ఇక రాజయ్య కావేశం ఆగలే....నర్సయ్యను ఎనుకకు గుంజిండు. "మామ! అట్లాగు.... నేమ్మాట్లాడుత. ఎందుకు దొర, దండుగ్గట్టాలె? ఐదునూర్లు పెద్ద మనుషులకు, ఐదునూర్లుతోని కులపోల్లు కల్లుదాగుతె పోయిన కులమెట్లొస్తది....? కల్లుతోని అచ్చేకులం పోతేందుంటోంది? ఏం తప్పు జేసినమని వెయ్యి రూపాయలియ్యాలె...? ఎవ్వడో నీ బాంచెగాడు మాకు తెలవకుంట పిర్యాజ్జేస్తే మాకేంది...? అన్నే కట్టుమను దండగ....మేం తప్పుజెయ్యలేదు...." అన్నాడావేశంగ.

ప్రజల్లో కలకలం బయల్దేరింది.

"రాజిగాడు సెప్పింది నిజమే.... ఏం తప్పు సెయ్యనప్పుడు దండు గెందుకు గట్టాలె....?"

"అది, ఆడు లగ్గం జేసుకంటన్నంక నడుమ గీ దొరేంది.......?"

"రాజిగాడు భలే మాట్లాడిండు..."

రకరకాలుగ ప్రజలనుకోబట్టింద్రు. దొరమొకం నల్లబడ్డది.... వేపచెట్టు కొమ్మ మీదినుంచి ఓ గండు చీమ దొర మెడపై బడి కసిక్కున కొరికింది.... చీమను దొరుకబట్టపోయిండు దొర.... కానది తప్పిచ్చుకొని అంగి లోపలికి జొచ్చి వీపుల కుట్టింది. చేసేదేంలేక బనీనొదల్జేసి దులిపేసిండు. రాజయ్య కనుకూలంగ ప్రజల్నుండి వచ్చే మాటలు విన్న దొర దిక్కులు చూసిండు. తన చేతికింద బ్రతికే సుంకరోల్లు కూడ సంతోషంగనే ఉన్నరు. దొర అల్ల మొకంకేసి చూసేవరకు విచారం మొకంపెట్టి మొకాన్ని నాలెకేసింద్రు. పెద్ద మనుషుల మొకాలల్ల రక్తంలేదు. వానితోని పెట్టుకుంటే సారపోరగాండ్లతో నెగపడుతతడు. కాలం మంచిగలేదు ....

గాలికి పొయ్యే కంపనెందుకు తలుగ బెట్టుకోవాలెనని సప్పుడు జేకున్నరు దొరగ్గాడ లోపల భయంగానే ఉంది, మేకపోతు గాంభీర్యంతో నన్నడు "...పండ్లచ్చినాయిర... రాజిగ.... సిన్న పెద్ద భేదంలేదు? నాయం అన్నాయం సూడద్ద...?

రాజయ్య కొదమసింహమోలె ముందుకచ్చిండు. "నాయం...! అన్నాయం... ప్రజలని గొర్లంజేసి ఎన్నేండ్లేలుతరు రాజ్జెం....? దొంగ నాకొడుకు కులపెద్దను గట్టుకొని దండుగలు పెట్టిత్తమంటె ఇక్కడెవ్వర్లేరు ఇచ్చుటానికి.....సరే....నా తప్పే.....కాని పెండ్లి గాకముందే బొత్తసేసుకొని దిగదాగిన నీ బిడ్డకు ఏం దండగ కట్టినవ్? ముండమోసి ఇంట్లుండి పాలేర్తోని సాటుమాటుగ రంకుజేత్తున్న పట్వారి బిడ్డ సంగతేంది? మీరు జేత్తేనేమొ తప్పుగాదు, మేం జేత్తే తప్పా? మీ కులాలు మీ దగ్గర్నే ఉంచుకోండ్రి, రెక్కల కట్టంమీద బతికే మాకు ఏ కులమైతేంది? ఏ ఊరైతేంది? ఏ కులంలున్నా, ఏ ఊళ్ళున్నా, ఏ పట్నంలున్నా రెక్కల నమ్ముకొని బతుకాలె. గట్లాంటప్పుడు నీకు దండుగ్గట్టె కులంలకు అచ్చుడెందుకు? ఈ ఊరు గాకుంటే ఇంకో ఊరు... ఎక్కడున్నా మా కట్టం మాదే. ఐనా ఇక్కన్నే, ఈ వూళ్ళోనె తలుకాయ ఎగిరేసుకుంట బతుకుత. ఎవ్వలడ్డమొత్తరో, ఎవ్వలేంజేత్తరో సూత్త...." అని నర్సయ్య దిక్కు తిరిగి –

"రా మామా! అణిగిమణిగి ఉన్నకొద్ది గిట్లనే సవారిజేత్తరు. కులం కులమని ఇడిపోతె మనదాంట్ల మనకే కొట్లాట పెడ్తారు. కట్టపడి బతికెటోల్లది, కూలోల్లది అంతా ఒక్కటే కులం" అని ఓసారి అందరి దిక్కు సూసిండు.... చాలామందినుంచి తన కనుకూలతే కనపడ్డది.

మల్లి దగ్గెరి కచ్చిండు.

"రాయే మల్లి.... ఎందుకు బయపడ్తన్నవ్? ఏం తప్పు చేసిన్నని నాలెకు మొకమేసినవు? నాతోని రా! నిన్ను లగ్గం చేసికుంట...నీ కొడుకును నా కొడుకోలె సూసుకుంట" అని రాజేశంను సంకలెత్తుకొని, మల్లవ్వనొక చేత్తో పట్టుకొని దర్పంగ, పొగరుగ అడుగులేసుకుంట పోసాగిండు రాజయ్య.

చెట్టుపై ఉడుత కిచకిచమన్నది. దొర, దొర చెంచాల మొకాలు కందెనమసి పూసినట్టు నల్లగయినయి. తేలుకుట్టిన దొంగలోలె నెత్తులమీద బట్టలేసుకొని ఇండ్ల దారి పట్టిండ్రు. పొద్దు నెత్తిమీద కచ్చింది. తొవ్వెంబడి పోతున్న పుల్లకోడె అంకె వేసింది...... అది సింహం గర్జించినట్లుంది.

● *"సృజన" 1983,* జనవరి ●

★ ★ ★